ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 33.0 | కనిష్ఠం : 24.0



169 పరుగులతో మహబూబ్‌నగర్ గెలుపు

- బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించిన మనోజ్‌యాదవ్
- అర్ధ సెంచరీతో రాణించిన యువన్



బౌలింగ్‌లో రాణించిన మనోజ్‌యాదవ్

వార్త 5లో..

వ్యవసాయానికి పెద్దపీట



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- మహిళా సాధికారత కోసం కృషి
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్
- పేదల సంక్షేమం.. సుపరిపాలనే లక్ష్యం
- నేటినుంచి 20 వరకు అన్ని గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు
- జిల్లాకు ట్రిపుల్‌ఐటీ, నవోదయ విద్యాలయాలు మంజూరు
- రాష్ట్ర అవతరణ దినోత్సవంలో మంత్రి జూపల్లి



కలెక్టరేట్ వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్, జూన్2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో రైతును రాజును చేయాలని వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ సమీకృత భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకిలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జూపల్లి మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకెళ్తున్నామన్నారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచస్థాయి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక పాలనే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. రైతు భరోసా పథకం కింద యాసంగి సీజన్‌కు 2.50 లక్షల మంది రైతులకు రూ.250.78 కోట్లు కేటాయించామన్నారు. ఇప్పటివరకు 1.88 లక్షల మందికి రూ.158.16 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. పంట రుణమాఫీ ద్వారా జిల్లాలో 76,385 మంది రైతులకు రూ.597 కోట్లు మాఫీ చేయడం జరిగిందన్నారు. ఈ వానాకాలంలో 3.64 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశామన్నారు. ఖరీఫ్‌లో రైతుల నుంచి 91,855 టన్నుల ధాన్యం సేకరించామని, అందులో 65,659 టన్నుల సన్నాలకు రూ.31.29 కోట్లు బోనస్ ఇచ్చామన్నారు. రబీలో 1.37 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని గుర్తు చేశారు.

మహిళలకు ప్రోత్సాహం

మహిళాశక్తి ద్వారా కలెక్టరేట్, మూసాపేటలో మహిళాశక్తి క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. దేవరకద్ర, బాలానగర్ మండలాల్లో మహిళా సంఘాల ద్వారా ఒక్కోటి రూ.4 కోట్ల వ్యయంతో రెండు సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి త్వరలోనే ప్రారంభించబోతున్నామని చెప్పారు. 7 మండల మహిళా సమాఖ్యల ద్వారా 7 బస్సులను కొనుగోలు చేసి, ఆర్టీసీకి అద్దెకు ఇచ్చామన్నారు. జిల్లా కేంద్రంలో మహిళా సంఘాల ద్వారా తొందరలోనే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామన్నారు.



ఇందిరమ్మ ఇంటి లబ్దిదారుకు చెక్కును అందిస్తున్న మంత్రి జూపల్లి, (ఎడమ నుంచి) ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

నాణ్యమైన విద్యకు విద్యాలయాలు

నాణ్యమైన విద్య కోసం బాలానగర్ మండలం పెద్దాయపల్లి, సీసీకుంట మండలం దమగ్నాపూర్‌లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి మరో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైందని చెప్పారు. జిల్లాకు ఇటీవలే ప్రభుత్వం ట్రిపుల్ ఐటీని మంజూరు చేస్తూ జీవో విడుదల చేసిందని వివరించారు. జవహర్ నవోదయ విద్యాలయం కూడా పాలమూరు జిల్లాకు మంజూరైందని తెలిపారు. సోమవారం నుంచి 20 వరకు అన్ని గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. బ్యాంక్ లింకేజీ కింద జిల్లాలోని 130 మహిళా సంఘాలకు రూ.10 కోట్ల రుణాల చెక్కులను మంత్రి, ఎమ్మెల్యేలు పంపిణీ చేశారు. స్త్రీనిధి కింద మరో రూ.5 కోట్ల రుణాలను అందజేశారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల, పరిగి నియోజకవర్గాలకు చెందిన 14 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. వరకు నిర్మాణాలు చేసిన నలుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చెక్కులను ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారి

ఎన్నికల ప్రక్రియ షురూ



మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కార్యాలయం

- కొత్త నగరపాలిక, పురపాలికల్లో వార్డుల విభజనకు ముసాయిదా విడుదల
- 19 రోజుల్లో పూర్తి చేయాలన్న ప్రభుత్వం
- జూన్ 21న ఫైనల్ నోటిఫికేషన్
- రేపటి నుంచే మహబూబ్‌నగర్, దేవరకద్ర, మద్దూర్‌లలో ప్రారంభం

కార్పొరేషన్‌లు, పురపాలికల్లో ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన వాటిలో వార్డుల విభజన ప్రక్రియను మంగళవారం నుంచి చేపట్టేందుకు ముసాయిదా జీవోను విడుదల చేసింది. 21న ఫైనల్ నోటిఫికేషన్ వెలువడనుండగా, ఆ జాబితా వచ్చిందంటే ఎన్నికలకు ఇక అంతా సిద్ధమైనట్లే. పాలమూరు జిల్లాలో దేవరకద్ర, నారాయణపేట జిల్లాలో మద్దూరు కొత్త మునిసిపాలిటీలు కాగా, మహబూబ్‌నగర్ మునిసిపాలిటీని నగరపాలికగా అప్‌గ్రేడ్ చేశారు.

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి

2

మెరుగైన సేవలే లక్ష్యం

- సమావేశంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నారాయణపేట జిల్లా ఆస్పత్రిని గత పాలకులు అప్పక్‌పల్లిలో నిర్మించిన భవన సముదాయంలోకి తప్పని పరిస్థితుల్లో తరలించామని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట సీవీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నారాయణపేటకు పన్నెండు కిలోమీటర్ల దూరంలో గత పాలకులు అప్పక్‌పల్లి దగ్గర ఆస్పత్రి భవనం నిర్మిచారన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న పాత ఆస్పత్రి భవన సముదాయం శిథిలావస్థకు చేరడంతో వర్షాలకు ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితికి చేరుకుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిని అప్పక్‌పల్లికి తరలించామన్నారు. కొన్ని ఇబ్బందులు ఎదురైనా.. ప్రజలు సహకరించాలన్నారు. కొత్తగా సీటీ స్కానింగ్ వచ్చిందని, అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు రెండో సంవత్సరం నుంచి ఆస్పత్రిలో ఫిజికల్ క్లాసులు ఉంటాయన్నారు. నర్సింగ్ కాలేజీతో పాటు మాతా శిశు సంక్షేమ సంరక్షణ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక వైద్యురాలిగా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చుస్తానన్నారు. ప్రాథమిక వైద్యసేవల కోసం అర్బన్ హెల్త్ సెంటర్‌తోపాటు పీపీ యూనిట్‌లో వైద్యం అదేలా చూస్తామని తెలిపారు. అప్పక్‌పల్లి జిల్లా ఆస్పత్రి దగ్గర ప్రతీ బస్సు ఆపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామని, బస్సులు ఆపుతారని చెప్పారు. ఆస్పత్రికి రెండు అంబులెన్స్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఆటో చార్జీల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీతో మాట్లాడామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మాజీ చైర్మన్‌లు బండి వేణుగోపాల్, సుధాకర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

18 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

- ఉత్తర్వులు జారీ చేసిన డీఐజీ
- ఉమ్మడి జిల్లాల్లో పోస్టింగ్‌లు

5

వివాహిత అనుమానాస్పద మృతి

- నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలో ఘటన

5

యువకుడి అదృశ్యం

- నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

5

మత్స్యకారుల వలకు భారీ చేప

- మంచాల కట్ట సమీపంలో కృష్ణానదిలో 22 కిలోల బొచ్చ లభ్యం

2

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

- పాలమూరులో 3, 'పేట'లో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు మహబూబ్‌నగర్ జిల్లాలో 3, నారాయణపేట జిల్లాలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పాలమూరులో 1,243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నరు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 286 మంది హాజరు కానుండగా, హిందీ పరీక్షకు 36 మంది, ఇంగ్లీష్‌కు 212 మంది, గణితానికి 610 మంది విద్యార్థులు రానున్నారు. సైన్స్‌కు 532 మంది, సాంఘిక శాస్త్రానికి 94 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

- నారాయణపేట జిల్లాలో తెలుగు, ఇంగ్లీష్, ఊర్దు, కన్నడ మీడియాలకు సంబంధించి అన్ని సబ్జెక్టులు కలిపి 406 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

కోయిల్‌సాగర్‌కు నీటి విడుదల

- పూజలు చేసి ప్రారంభించిన ఎమ్మెల్యేలు జీఎంఆర్, శ్రీహరి



స్విచ్‌ఆన్ చేసి, నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు జీఎంఆర్, శ్రీహరి

చిన్నచింతకుంట/నర్వ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు జీ.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి సోమవారం రాత్రి విడుదల చేశారు. మండలంలోని ఉంద్యాల ఫేజ్-1 పంపహౌస్ ద్వారా నీటిని వదిలారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఎలాగైతే ప్రకృతి సహకరించి, రైతులు సంతోషంగా ఉన్నారో ఇప్పుడు కూడా సీఎం రేవంత్‌రెడ్డి పాలనలోనూ ప్రకృతి సహకరిస్తుందన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు కురవడంతో జూన్ మొదటి వారంలోనే కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రజాపాలనలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ ప్రతాప్‌సింగ్, డీఈ నమియోద్దీన్, ఏఈఈ జాకీర్ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.



విడుదలవుతున్న నీరు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వాగ్దేవి ప్రభజనం



విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకటరెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రభజనం సృష్టించారు. కళాశాలకు చెందిన విద్యార్థి అశ్విని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 2610 ర్యాంకు సాధించగా, పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకటరెడ్డి విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. ఏ పరీక్షలోనైనా వాగ్దేవి విద్యార్థులదే విజయం అన్నారు. కార్యక్రమంలో ఐఐటీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, అధ్యాపకులు యాకుబ్, గోవిందరాజులు, సందీప్, మహేష్‌గౌడ్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో రిషి జయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రిషి కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. పరీక్షలు ఏవైనా ఫలితాల్లో తమకు ఎవరూ సాటి, పోటీ ఉండరని మరోసారి నిరూపించారు. జాతీయ స్థాయి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థి అభితేజ 209వ ర్యాంకు, సుచిత్ర 726వ ర్యాంకు, భాను ప్రసాద్ 1169వ ర్యాంకు, విజయ్‌కుమార్ 1621వ ర్యాంకు, తేజశ్రీ 1664 ర్యాంకు, ప్రణీత్‌కుమార్ రెడ్డి 1692వ ర్యాంకు, రాథోడ్ రమేష్ 2321వ ర్యాంకు, వర్షిని 4454వ ర్యాంకు, మధు 7793వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల చైర్మన్ చంద్రకళ వెంకట్, చీఫ్ అడ్వైజర్ వెంకటయ్య అభినందించారు. డీన్ భూపాల్ రెడ్డి, ఐఐటీ డీన్ కళ్యాణ్‌బాబు, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి, వెంకటరమణ, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించాలి

» తుర్కపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడిన హౌసింగ్ ఎండీ గౌతమ్



అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర హౌసింగ్ ఎండీ గౌతమ్

అమ్రాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ ఎండీ గౌతమ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామానికి 34 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే 11 మంది లబ్ధిదారులు బేస్మెంట్ వరకు నిర్మాణాన్ని పూర్తి చేసిన విషయాన్ని సోమవారం ఎండీ గౌతమ్, నాగర్‌కర్నూల్ జిల్లా ఈడీ సంగప్పతో కలిసి తుర్కపల్లిలో స్వయంగా లబ్ధిదారులతో మాట్లాడారు. మిగిలిన 23 మంది లబ్ధిదారులు కూడా బేస్మెంట్, వరకు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం పేర్కొన్న నిబంధనల ప్రకారం నిర్మించుకున్న లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులను జమ చేయడం జరుగు తుందని ఆయన వెల్లడించారు. అమ్రాబాద్ ఎంపీడీవో జగదీశ్వర్, తుర్కపల్లి పంచాయతీ కార్యాదర్శి విష్ణు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

» ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా రెండవ రోజు సోమవారం నిర్వహించిన తరగతులకు రజనీకాంత్‌తో పాటు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'జాతీయోద్యమ చరిత్ర' అంశంపై బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. శాస్త్రీయ విద్యావిధానం అమలు కోసం ఉద్యమించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, శ్రీకాంత్‌వర్మ, ప్రశాంత్ , కన్వీనర్ పూజ, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్ , ఉపాధ్యక్షులు నందు, రమేశ్, జ్ఞాపిక, ఈశ్వర్, రాజేశ్, రాధిక, నవ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలకు భారీ చేప

» 22 కిలోల బొచ్చ లభ్యం




మంచాలకట్టలో భారీ చేపను చూపుతున్న మత్స్యకారుడు నాగార్జున

పెంట్లవెల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండలంలోని మంచాల కట్ట సమీపంలో, కృష్ణానదిలో చేపల వేటలో ఓ మత్స్యకారుడికి భారీ చేప లభించింది. ఎగువన జూరాల ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో కృష్ణానదిలో నీరు ప్రవహిస్తోంది. మత్స్యకారుడు నాగార్జున నదిలో వల వేయగా, 22 కిలోల బొచ్చ రకం చేప చిక్కింది.

శ్రీశైలం ప్రాజెక్టులో 51 టీఎంసీల నీరు

» 17 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో



శ్రీశైలం ప్రాజెక్టులో ప్రాజెక్టు

దోమలపెంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులో ఉన్న శ్రీశైలం జలాశయంలో 51.9634 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు గేజింగ్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు ఎగువనున్న సుంకేసుల నుంచి 2,231 క్యూసెక్కులు, జూరాల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పాదనతో 22,987 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 30,218 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండగా, శ్రీశైలం ప్రాజెక్టులోకి 17,055 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఎంజీకేఎల్ఐ కాల్వకు నీటిని తరలింపును నిలిపివేశారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, సోమవారం 832.30 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను 51.9634 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగడం లేదు.

జూరాలకు నిలకడగా వరద..

ధరూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద స్థిరంగా కొనసాగుతుండటంతో ఇన్‌ఫ్లోలు స్వల్పంగా పెరిగాయి. ఎగువనున్న అల్మటి జలాశయంలో 54.02 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకోగా, ఆ ప్రాజెక్టు దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలో 27.21 టీఎంసీలకు నీటి నిల్వ చేరకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల జలాశయంలో 317.990 మీటర్లలో 4.884 టీఎంసీల నీరు ఉన్నది. ప్రాజెక్టుకు 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, జలవిద్యుత్ కేంద్రానికి 27,987 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మూడు యూనిట్ల ద్వారా 160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదలను నిలిపివేసిన అధికారులు నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 750 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మొత్తంగా జూరాల ప్రాజెక్టు నుంచి 28,804 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉమ్మడి పాలమూరు మెరుపులు

గద్వాల సర్కిల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ (జాయింట్ ఎట్రన్స్ ఎగ్జామినేషన్) అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో పలువురు ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వేదనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధోత్రే మహేశ్, బాలిక దంపతుల కుమారుడు అభిజిత్ ధోత్రే జాతీయ స్థాయి కామన్ ర్యాంక్ లిస్ట్(సీఆర్ఎల్)లో 173 మార్కులతో 2,474 ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 446 ర్యాంకు సాధించాడు. గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులు వేణుగోపాల్‌రెడ్డి, జమునల కుమార్తె దీక్షిత జాతీయ స్థాయి కామన్ ర్యాంక్ లిస్ట్(సీఆర్ఎల్) 150 మార్కులతో 4,445 ర్యాంకు సాధించింది. కాగా ఏప్రిల్‌లో విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అభిజిత్ 99.69 పర్సంటైల్ సాధించగా, జనవరిలో విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో దీక్షిత 99.49 పర్సంటైల్ సాధించి ప్రతిభను చాటుకున్నారు. సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌లో ఫలితాల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన అభిజిత్, దీక్షితలను వారి తల్లిదండ్రులతో పాటు స్థానికులు అభినందించారు.

భవిష్యత్తులో ఇంజనీరింగ్‌గా స్థిరపడడమే తన లక్ష్యమని అభిజిత్ పేర్కొనగా, తాను సివిల్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని దీక్షిత 'ఆంధ్రజ్యోతి'తో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.



అభిజిత్ ధోత్రే



దీక్షిత

396వ ర్యాంకు సాధించిన కొర్ర ఇందు

చారకొండ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పంచాయతీలోని తూర్పుతండాకు చెందిన కొర్ర జయ, నరేందర్‌నాయక్ కూతురు కొర్ర ఇందు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో రాష్ట్ర 396 ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ అర్చన్ కాలేజీలో ఆమె ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు, తండావాసులు, కాలేజీ యాజమాన్యం ఆమెకు అభినందనలు తెలిపారు.



కొర్ర ఇందు

714వ ర్యాంకు సాధించిన అనిరుధ్

అయిజ (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని పులికల్ గ్రామానికి చెందిన గాండ్ల నర్సింహులు, సరిత దంపతుల కుమారుడు అనిరుధ్ ఓబీసీ కేటగిరీలో 714 ర్యాంకు సాధించాడు. పరీక్షలో 99.64 పర్సంటైన్ తెచ్చుకున్నాడు.



అనిరుధ్

అభినవ్‌కు 850 ర్యాంకు

వనపర్తి విద్యా విభాగం (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేశ్ (ఎస్టీటీ), శైలజ (లెక్చరర్)ల కుమారుడు అభినవ్ యాదవ్ ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంకు 850, ఓబీసీ ర్యాంకు 134 సాధించాడు. భవిష్యత్తులో ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని అభినవ్ తెలిపారు.



అభినవ్

సత్తాచాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పతకాలు సాధించిన అల్లీపూర్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన నాగర్‌కర్నూల్ క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

» అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 పతకాలు

చిన్నచింతకుంట/ నాగర్‌కర్నూల్ టౌన్ జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ - 2025 పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో సోమవారం నిర్వహించిన ఈ పోటీల్లో వారు రాణించి 5 పతకాలను సాధించారు. బ్రాడ్ జంప్‌లో సుచిత్ర వెండి పతకం, బాల్‌త్రోలో కాంస్య పతకం, అర్జున్ బాల్ త్రోలో వెండి పతకం, కిడ్స్ జావెలిన్ త్రోలో నరేశ్‌వెండి పతకం, షాట్‌పుట్‌లో కురుమూర్తి కాంస్య పతకాలు సాధించారు. గ్రామం పేరును రాష్ట్ర స్థాయిలో నిలిపిన వారిని శిక్షకుడు నవీన్, మినీ ఇండోర్ స్టేడియం జూనియర్ అసి స్టెంట్ నరేశ్, మాజీ సర్పంచ్ రఘువర్ధన్ గౌడ్, తల్లిదండ్రులు అభినందించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అండర్-12 విభాగంలో 600 మీటర్ల పరుగులో అభినవ్ రెడ్డి, జావెలిన్ త్రోలో శ్రీచైతన్య, కిరణ్ సిల్వర్ మెడల్స్ సాధించారు. 300 మీటర్ల పరుగులో ముడావత్ శివరామకృష్ణ బంగారు పతకం, లాంగ్ జంప్‌లో వెండి పతకం సాధించాడు. వారిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.విజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పోల పోగుల స్వాములు, ఉపాధ్యక్షులు లావణ్య రెడ్డి, లక్ష్మి, భిక్షపతి, కోశాధికారి విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు పరశురాం, అంజయ్య, కొర్ర రాములు, సభ్యులు శివకుమార్, శ్రీకాంత్, శేఖర్, హైమావతి, విష్ణు అభినందనలు తెలిపారు.

సంత.. తప్పని చింత

» వసతులు లేక అవస్థలు



బిజినేపల్లి సంతలో పశువులు, జీవాలు విక్రయిస్తున్న ప్రజలు

బిజినేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోనే మంచి ఆదాయం ఉన్న బిజినేపల్లి సంతలో వసతులు లేక వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. వేలంలో సంత దక్కించుకున్న కాంట్రాక్టర్లు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం సమస్యగా మారింది. ఈ ఏడాది సంత వేలం పాట దాదాపు రూ.50 లక్షలు పలికింది. ఆరేళ్ల క్రితం సంత నిర్వహిస్తున్న ప్రాంతం చుట్టూ ప్రహరీ, పశులు కోసం నీటి తొట్లు, నీడ కోసం షెడ్ల నిర్మాణం చేయాలని గ్రామ పంచాయతీ చేసిన తీర్మానం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తమతో పన్ను వసూలు చేస్తున్నా, కనీస వసతులు కల్పించకపోవడంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూరగాయాలు విక్రయానికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపుల కూర్చొని అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే షెడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

అదనంగా తైబందు వసూలు

వేలం పాటలో ఏడాది కాలానికి సంతను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిబంధనలను పట్టించుకోవడం లేదని వ్యాపారులు, రైతులు ఆరోపిస్తున్నారు. వాహనాలు, పశువులు, గొర్రెలు, మేకలు, కూరగాయలు, పండ్ల వ్యాపారుల వద్ద తైబందు ఎంత వసూలు చేయాలో ధరల పట్టికను ఎక్కడా ఏర్పాటు చేయలేదని చెప్తున్నారు. దీంతో నిర్ణయించిన మొత్తం కన్నా ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సంతలో అమ్మేందుకు తెచ్చిన పశువులకు నీడ కరువైందని, షెడ్లు లేక ఎండలోనే ఉండాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. నీటి తొట్లు లేక పశువులు దాహంతో అల్లాడుతున్నాయని అంటున్నారు.

ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికా రులు స్పందించి సంతలో వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీర్మానం మేరకే వసూలు



పంచాయతీ తీర్మానంలో పేర్కొన్న తైబందు వసూలు చేయాలని సంత దక్కించుకున్న వ్యాపారిని ఆదేశించాం. అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదు. ఉపాధి హామీ నిధులు మంజూరైతే ప్రహరీ, నీటి తొట్లు, షెడ్లు నిర్మిస్తాం. ధరల పట్టికలను ఏర్పాటు చేయమని సూచించారు. తాగునీటి కోసం ట్యాంకర్‌ను ఏర్పాటు చేశాం. - మహేశ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి, బిజినేపల్లి

ఎన్నికల ప్రక్రియ షురూ

» కొత్త నగర పాలిక, మునిసిపాలిటీలలో వార్డుల విభజన ప్రక్రియకు ముసాయిదా విడుదల

» 19 రోజుల్లో పూర్తి చేసి నివేదిక సమర్పించాలన్న ప్రభుత్వం

» జూన్ 21న ఫైనల్ నోటిఫికేషన్



మద్దూర్ పురపాలక సంఘ కార్యాలయం

మహబూబ్‌నగర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లు, పురపాలికల్లో ఎన్నికల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే పాలక మండళ్ల గడువు ముగిసి, నాలుగు నెలలు దాటుతుండటంతో ఎన్నికల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు చేసుకునే పని మొదలుపెట్టింది. అందులో భాగంగా ఇటీవల ఏర్పాటుచేసిన కొత్త మునిసిపాలిటీలతో పాటు కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలలో వార్డుల విభజన(సరిహద్దులు నిర్ణయించడం) చేపట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే ముసాయిదా ప్రతిపాదనకు సంబంధించి జీవో 269ని ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి పాలమూరులో కొత్త మునిసిపాలిటీలు దేవరకద్ర, మద్దూరు ఏర్పాటుతోపాటు మహబూబ్‌నగర్ మునిసిపాలిటీని అప్‌గ్రేడ్ చేస్తూ కార్పొరేషన్ చేశారు. రెండు గ్రామ పంచాయతీలను విలీనం చేసి 49 వార్డులను కాస్త 60కి పెంచారు. ఇప్పుడు వార్డుల విభజన చేయాల్సి ఉంది. దీనికోసం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటికే అధికార యంత్రాంగం వార్డులను విభజించింది. పాలమూరు కార్పొరేషన్‌లో సగటున 3,200 ఓట్లకు ఒక వార్డు చొప్పున విభజించారు. ఇప్పుడు వీటిపై ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలు తీసుకుని, వాటిని పరిష్కరించి తుది జాబితాను ప్రభుత్వానికి నివేదిస్తారు. అప్పుడు ఫైనల్ జాబితా వెలువడుతుంది. నేటి నుంచి ప్రక్రియను ప్రారంభించి, 19 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. పాలమూరు కార్పొరేషన్‌లో దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామ పంచాయతీలు విలీనం కాగా, దేవరకద్ర కొత్త మునిసిపాలిటీలో దేవరకద్రతోపాటు చౌదర్‌పల్లి, బలుసుపల్లి, పెద్దగోప్లాపూర్, మీనుగోనిపల్లి గ్రామ పంచాతీలు ఉన్నాయి. మద్దూరు మునిసిపాలిటీలో మద్దూరుతోపాటు రెనివట్ల గ్రామపంచాయతీ ఉంది. ఇప్పుడు ఆయా మునిసిపాలిటీల పరిధిలో వార్డుల చేయాల్సి ఉంటుంది.

పాలమూరులో మారనున్న వార్డుల స్వరూపం

కొత్త మునిసిపాలిటీలైన దేవరకద్ర, మద్దూరులో విభజన పెద్ద ఇబ్బంది లేదు. కానీ పాలమూరు కార్పొరేషన్‌లో ఇప్పటికే వార్డులున్నాయి. 49 కాస్త 60కి పెరగడం, కొత్తగా రెండు గ్రామ పంచాయతీలు విలీనం కావడంతో వాటన్నింటిని కలిపి 60 వార్డులు చేయాల్సి ఉండటంతో ప్రస్తుతం ఉన్న వార్డుల స్వరూపం మారనుంది. ఉన్న వార్డులోంచి కొంత భాగం పక్కవార్డులోకి, పక్కవార్డులోంచి కొంత భాగం ప్రస్తుతం ఉన్నవార్డులో కలిసే అవకాశం ఉంది. కొన్ని వార్డులు పూర్తిగా మారిపోయే అవకాశం కూడా లేకపోలేదు. అందుకే పాలమూరులో ఆశావహులు, సిట్టింగ్‌లు తమ వార్డుల స్వరూపంపై టెన్షన్ పడుతున్నారు. అయితే ఇప్పటికే అన్ని మునిసిపాలిటీలలో అధికారులు ప్రాథమికంగా వార్డుల విభజన చేశారు. ఇప్పుడు వాటిపైనే సలహాలు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

నేటి నుంచి 19 రోజుల్లో పూర్తి చేయాలి

వార్డుల విభజన ప్రక్రియను 19 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు సంబంధించి ముసాయిదా ప్రతిపాదనను మంగళవారం విడుదల చేయాలి. 4న ప్రజల సలహాలు స్వీకరించాలి. న్యూస్‌పేపర్‌లో పబ్లిష్ చేయాలి. అలాగే ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈ ముసాయిదా ప్రతిపాదనలు అందించాలి. 5 నుంచి 11వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలు స్వీకరించాలి. 12 నుంచి 16వ తేదీ వరకు 5 రోజుల పాటు స్వీకరించిన సలహాలు, అభ్యంతరాలను విచారించి చర్యలు తీసుకోవాలి. 17, 18 తేదీలలో తయారుచేసిన తుది జాబితాకు ఆమోదం తీసుకోవాలి. జూన్ 19న కమిషనర్లు ఈ జాబితాను సీడీఎంఏకు సమర్పించాలి. జూన్ 20న సీడీఎంఏ ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తే.. 21న వార్డుల విభజనకు సంబంధించిన ఫైనల్ నోటిఫికేషన్ వెలువడుతుంది. అంటే వార్డుల విభజన ప్రక్రియ నేటినుంచి 19 రోజుల్లో ముగియనుంది. వార్డుల విభజన పూర్తయ్యిందంటే ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమం కానుంది.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్



మినీ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట న్యూటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రికెటర్ అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ - 29 క్రికెట్ లీగ్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాగర్‌కర్నూల్, నారాయణపేట జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడా పోటీలతో వివిధ ప్రాంతాల మధ్య సమన్వయం, క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. జిల్లా వైద్యాధికారి చంద్రమోహన్ మాట్లాడుతూ ఎండీసీఏ కార్యదర్శి రాజశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్ఐ రేవతి, డీవైఎస్‌వో వెంకటేశ్‌శెట్టి, పరిశీలకులు మహమ్మద్ ముక్తర్ అలీ, కోచ్ రమణ, అజయ్‌కుమార్, చెన్నారెడ్డి, కోటి రవి, అత్తర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత అనుమానాస్పద మృతి


అలివేలు మంగ (ఫైల్)

దామరగిద్ద/ నారాయణపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలంలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. నారాయణపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దామరగిద్ద మండలం లోకుర్తి గ్రామానికి చెందిన జే వెంకటేశ్వరరావుకు ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్య అలివేలుమంగ (46) దామరగిద్ద ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఆమె నారాయణపేట పట్టణం, సింగార్‌బేస్ వీధిలోని ఇంట్లో భర్త వెంకటేశ్వర్‌రావుతో కలిసి నివసిస్తోంది. రెండో భార్య జ్యోతి లోకుర్తిలోనే ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం వెంకటేశ్వర రావు బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి అలివేలుమంగ అపస్మారకస్థితిలో పడి కనిపించింది. వెంటనే చుట్టుపక్కల సాయంతో ఆమెను నారాయణపేటలోని జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అలివేలుమంగకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సోదరి మృతిపై తమకు అనుమానం ఉందని ఆమె అన్న మడుగు రమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, మండలంలోని మంతటి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంతటి గ్రామానికి చెందిన చిక్కొండ్ర ఖతాలు (40) నాగర్‌కర్నూల్ వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. మంతటి చౌరస్తాలోని పెట్రోలు బంకు వద్ద మలుపు తిరుగుతున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

గోపాల్‌పేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోపాల్‌పేట ఎస్ఐ నరేశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలం లోని ఏదుట్ల గ్రామానికి చెందిన గుడ్ల కోటయ్య (65) కొంతకాలంలో అ నారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. బాధ భరించలేక గత నెల 20న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుళికల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడిని వనపర్తి ఏరియా ఆసుపత్రికి త రలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ప్ర భుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉ దయం మృతి చెందాడు. కొడుకు గుడ్ల కురుమయ్య ఫిర్యాదు మేరకు కే సు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెలు..

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన మైనగాని రాములు సోమవారం మధ్యాహ్నం తమ 4 గేదెలను మేతకోసం ఊరి బయటకు తీసుకెళ్లాడు. అక్కడ మేత మేస్తుండగా బోరు మోటార్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. సంఘటనపై బాధితుడు మైనగాని రాముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి కింద పడిన మహిళ

▸ తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం

గద్వాల క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌పై వెళ్తున్న ఓ మహిళ అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వడ్డెవీధికి చెందిన శ్రీలత (40) ఇంటి నిర్మాణ పనులు చేస్తూ జీవనం గడుపుతోంది. సోమవారం ఉదయం ధరూర్ మండలంలోని బురెడ్డిపల్లికి వెళ్లింది. పనులు ముగించుకొని ట్రాక్టర్‌పై గద్వాలకు తిరిగి వస్తుండగా రాఘవేంద్ర కాలనీ సమీపంలోని సంగాల పార్కు వద్ద అదుపుతప్పి కింద పడింది. ట్రాక్టర్ టైర్ ఆమె మీద నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఈమెను 108 అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

మేకలు చోరీ.. కేసు నమోదు

ఊర్కొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మేకల చోరీ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం.. రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మెక్కొండ అనంతరాములు మేకలు పోషిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం రాత్రి రోజు వారీగా ఇంటి ఆవరణలోని దొడ్డిలో ఉంచి నిదురపోయాడు. సోమవారం తెల్లవారుజామున దొడ్డిలో చూడగా తొమ్మిది మేకలు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు మెక్కొండ అనంతరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

▸ కేసు నమోదు


మాడ్గుల వెంకటేష్

ఊర్కొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యమైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం.. రాచాలపల్లి గ్రామానికి చెందిన మాడ్గుల వెంకటేష్ 25 సంవత్సరాల యువకుడు గత నెల 29న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లాడు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహి తుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభిం చకపోవడంతో సోమవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

సర్కార్ బడి పిలుస్తోంది

▸ విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు
▸ 6 నుంచి ప్రారంభం కానున్న 'బడిబాట'
▸ ప్రైవేటుకు దీటుగా ప్రచారానికి ఏర్పాట్లు
▸ సిద్ధమవుతున్న ఉపాధ్యాయులు



మామిడిమాడ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బడి బాట

ఖిల్లాఘణపురం, మే 2 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడి పిలుస్తోంది రా రమ్మని.. అన్ని వసతులు ఉంటాయని, అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని చెప్తోంది.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం 'బడిబాట'కు సిద్ధం అవుతోంది. ఈ నెల 6 నుంచి కార్యక్రమాన్ని ప్రారంభం కానున్నది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇప్పటికే ఈ పనిలో నిమగ్నం అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన విజయాలను కరపత్రాల రూపంలో ముద్రించి పంచుతున్నారు. విద్యాశాఖ ఆదేశాలతో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే వసతులు, మెరుగైన విద్యాబోధనపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రచారం చేస్తున్నారు.

భవిష్యత్తుకు బంగారు బాటలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉంటాయి. నిష్ణాతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారు. విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు పంపిణీ చేస్తారు. పౌష్టికాహారం, గుడ్లు, రాగి జావా ఇస్తారు. కంప్యూటర్ తరగతులు, శారీరక దృఢత్వం కోసం వివిధ క్రీడల్లో శిక్షణ, విశాలమైన తరగతి గదులు ఉంటాయి. ఒత్తిడి లేని విద్య, ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ, నిరంతర సమగ్ర మూల్యాంకనం, పఠన సామర్థ్యాల పెంపునకు గ్రంథాలయాలు, కంప్యూటర్ విద్యా, సైన్స్, గణిత, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ పంచాయతీలు, జన సమీకరణ ఉన్న ప్రాంతాల్లో స్వయం సేవక బృందాల సభ్యులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీల సహకారంతో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

మూతబడిన బడులు తెరుచుకునేనా?

వనపర్తి జిల్లాలోని గిరిజన తండాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా ఉన్నాయి. ఉన్న అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గు చూపుతున్నారు. కొన్ని తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా చిన్నారులు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్న సూచనలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలపై గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.


ప్రభుత్వ మండలం ప్రాథమిక పాఠశాల ఆగారం
ఖిల్లాఘణపూర్ మండలం, వనపర్తి జిల్లా

ఆగారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన బడిబాట కరపత్రం

భరోసా కల్పించాలి



గిరిజన తండాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు సర్కారు చదువుపై భరోసా కల్పించాలి. గిరిజన ఆవాస ప్రాంతాల్లో మూతబడిన ప్రభుత్వ బడులను పునఃప్రారంభించి నాణ్యమైన విద్యను అందించాలి. ఏకోపాధ్యాయ పాఠశాల వల్ల విద్యార్థులకు న్యాయం జరగడం లేదు.

\- విజయలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, దొంతికుంట తండా

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



సర్కార్ బడులపై తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నాం. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్నారు. 'బడిబాట'లో భాగంగా ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, విద్యార్థుల సంఖ్య పెంపునకు సూచనలు అందిస్తాం. గురుకులాల్లో ప్రవేశాలకు ప్రత్యేక విద్యాబోధన అందించేలా చూస్తాం. ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

\- జయశంకర్, ఎంఈవో, ఖిల్లాఘణపురం

169 పరుగులతో మహబూబ్‌నగర్ గెలుపు

▸ బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించిన మనోజ్‌యాదవ్
▸ అర్ధ సెంచరీతో రాణించిన యువన్


గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్


అర్ధసెంచరీతో రాణించిన యువన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 ఉమ్మడి జిల్లా వన్‌డే క్రికెట్‌లో మహబూబ్‌నగర్ జట్టు వనపర్తిపై 169 పరుగులు తేడాతో విజయం సాధించింది. జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ - వనపర్తి జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో యువన్ 93 బం తుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో అర్ధసెంచరీ (70) చేశారు. మనోజ్‌యాదవ్ 41 బంతుల్లో 8 ఫోర్లతో అర్ధసెంచరీ (52) సాధించారు. కాన్షిక్ 34, అబినవ్ 20 పరుగులు చేశారు. వన పర్తి బౌల ర్లలో చరణ్ 4, పరమేశ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వనప ర్తి జట్టు 28.2 ఓవర్లలో 113 పరుగులకు కుప్పకూలింది. జట్టులో మహేశ్‌నాయక్ 28, పర్ధద్ 26 ప రుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో మనోజ్‌యాదవ్ 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఎం. రాహుల్, అకింత్‌రాయ్ చోరో రెండు వికెట్లు తీశారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి

వన్ డే టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మహబూబ్‌నగర్ - వనపర్తి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ 2డే లీగ్‌లో క్రీడాకారులు ప్రతిభ చాటి అండర్-23 ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు. వన్‌డే టోర్నీలో రాణిస్తే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక వుతారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు రంజిత్ పాల్గొన్నారు.

టీటీసీసీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

▸ టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి
▸ ముఖ్యమంత్రి , మంత్రులు , ఎంపీ, ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్స్ (టీటీసీసీ) శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, పాలమూరు పునర్నిర్మాణ ఫోరం నాయకుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటి వరకు టీటీసీసీ శిక్షణ కేంద్రం లేదని లేఖలో పేర్కొన్నారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, హైదరాబాద్‌లలో శిక్షణ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. దీంతో ప్రతీ ఏడాది వేసవి సెలవుల్లో నిర్వహించే శిక్షణ కోసం మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి వేలాది మంది అభ్యర్థులు వందల కిలోమీటర్ల దూరం వెళ్లి శిక్షణ పొందాల్సి వస్తోందని పేర్కొన్నారు. డ్రాయింగ్, టైలరింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్, ఎంబ్రాయిడరీ తదితర కోర్సులను పాలమూరు, వనపర్తి జిల్లాల్లో ఏర్పాటు చేయాలని మూడు నెలలుగా అధికారులకు విన్నవిస్తున్నా స్పందించడం లేదని ఆరోపించారు.

అందుకు సీఎం అనుమతి తప్పనిసరి అని చెప్తున్నారని తెలిపారు. శిక్షణ సమయం జూన్ 11 వరకు ఉన్నందున ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించాలని కోరారు. రెండు జిల్లాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇప్పించాలని కోరారు. అందుకు సంబంధించి అధ్యాపక పోస్టులను మంజూరు చేయించాలని కోరారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు అవకాశం

గద్వాల టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ), ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గద్వాల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎస్‌వీవీ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కళాశాలల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్ (రెండు సంవత్సరాల కోర్సులు), డీజిల్ మెకానిక్, కోపా(ఒక సంవత్సరం కోర్సులు) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గద్వాల అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లో అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్) రెండు సంవత్సరాల కోర్సులు, ఆర్టీసియాన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ (ఒక సంవత్సరం కోర్సు)లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 10, 8వ తరగతులలో ఉత్తీర్ణులై 2025, ఆగస్టు 1వ తేదీ నాటికి 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు కొన్ని కోర్సులకు మాత్రమే అర్హులన్నారు. ఈ నెల 2 నుంచి 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రిటైర్మెంట్ వయసు పెంపు సరికాదు

▸ పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును పెంచే ఆలోచన మంచిది కాదని, నిరుద్యోగులకు అన్యాయం చేయాలని చూడటం తగదని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బెనిఫిట్స్ చెల్లించలేక రిటైర్మెంట్ వయసును మూడేళ్లు పెంచిందని గుర్తు చేశారు. ఈ విషయం కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసినా, నేడు ఆదే తప్పు చేయటానికి పూనుకోవటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించలేక రిటైర్మెంట్ వయసును పెంచుకుంటూ పోతే నిరుద్యోగులకు ఎలా న్యాయం జరుగుతుందో ప్రభుత్వమే జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలకోసం నిరుద్యోగులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల విరమణ వయసు పెంపును వ్యతిరేకిస్తూ నిరుద్యోగులకు అండగా పోరాడాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఉపాధి, ఉద్యోగ, వ్యాపారాల కోసం ఉత్తర భారత దేశం నుంచి అధిక సంఖ్యలో జనం వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దీంతో తెలంగాణ భూమి పుత్రులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈపరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో రాష్ట్రంలో మరోసారి పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతాయని తెలిపారు. ఈ పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోవటంలేదని, పైగా బయటి నుంచి పెట్టుబడులను పిలుస్తూ వారికి వనరులు కట్టబెడుతున్నారని విమర్శించారు. స్థానిక వనరులు, నీరు, భూమి ఇతరుల పాలుకాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు.

18 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

మహబూబ్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాకు చెందిన 18 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారికి ఆయా జిల్లాల్లో పోస్టింగ్ కూడా ఇచ్చారు. పదోన్నతి పొందిన వారిలో సయ్యద్ యాసిన్, బీ మధుసూదన్‌రెడ్డి, జే శ్రీనివాస్, వెంకప్ప, వీ నాగరాజు రెడ్డి, జే చెన్నకేశవులు, షాకిర్‌ఖాన్, ఐజాజ్ అహ్మద్‌ఖాన్, ఎండీ రియాజ్, ఎన్ బాలయ్య, వెంకట్‌నాయక్, పీ నాగరాజుగౌడ్, ఎండీ అక్బర్, నరేశ్‌కుమార్, ఆర్ వెంకట్‌రెడ్డి, బీ రాజారమేశ్, కే నాగరాజు, కే విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

▸ జోగులాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు


పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అలంపూర్ చౌరస్తా, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని సోమవారం సాయంత్రం డీఎస్పీ మొగిలయ్యతో కలిసి పరిశీలించారు. వాహనాల్లో పశువులను తరలిస్తూ పట్టుబడితే వాటికి పశువైద్యాధికారులతో పరీక్ష చేయించాలని సూచించారు. అక్రమంగా తీసుకెళ్తున్నట్లు నిర్ధారణ అయితే కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు. అనంతరం లేపాక్షి రెస్టారెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చార్జింగ్‌జోన్‌ను తనిఖీ చేశారు. చార్జింగ్ కెపాసిటీ, తదితర వివరాలను యజమాని బొంకూరు భాస్కర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అలంపూర్ సీఐ రవిబాబు, ఉండవెల్లి ఎస్ఐ మహేష్, గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జడ్చర్ల జట్టు ఘన విజయం

▸ గద్వాల జట్టుపై 250 పరుగుల అధిక్యం


బ్యాటింగ్ చేస్తున్న జడ్చర్ల జట్టు

జడ్చర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ - 19 టోర్నమెంట్‌లో జడ్చర్ల జట్టు ఘన విజయం సాధించింది. టోర్నీలో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మినీ స్టేడియంలో జడ్చర్ల, గద్వాల జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. జడ్చర్ల జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసింది. 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 420 పరుగులు సాధించింది. హర్షిత్ (169), కేతన్ కుమార్ (167) పరుగులతో సెంచరీలు చేసి సత్తా చాటారు. గద్వాల బౌలర్లను ఊచకోత కోసి భారీ స్కోరు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గద్వాల జట్టు జడ్చర్ల జట్టు బౌలర్ల ధాటికి పరుగులు సాధించలేక చతికిలపడింది. గద్వాల జట్టులో గోపీచంద్ ఒక్కరే 45 పరుగులు సాధించాడు. చివరకు 39 ఓవర్లకే అలౌట్ అయ్యింది. దీంతో జడ్చర్ల జట్టును 250 పరుగుల భారీ ఆధిక్యంతో విజయం వరించింది. కోచ్‌లుగా ముజీబ్, మహేశ్ వ్యవహరించారు.

కార్మికవర్గ శ్రేయస్సే ప్రధాన లక్ష్యం

▸ టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం



మహాసభలో మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

గద్వాల టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కార్మికవర్గ శ్రేయస్సే ప్రధాన లక్ష్యమని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం అన్నారు. గద్వాల పట్టణంలోని వాల్మీకి భవనంలో సోమవారం నిర్వహించిన టీయూసీఐ జోగుళాంబ గద్వాల జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఏకం చేసి, ఐక్య పోరాటాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనేక పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా అధ్యక్షుడు హనుమంతు అధ్యక్షతన జరిగిన మహాసభల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతరేవుల కృష్ణ, కోశాధికారి ఉప్పేరు కృష్ణ, సిద్ధయ్య, రంగన్న, సవారన్న, శంకరన్న, మహేశ్వరి, పార్వతమ్మ, బీచుపల్లి, రాఘవేంద్ర, శివయ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆర్థిక సాయం అందజేత

కోయిలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బ్రెన్‌స్ట్రోక్ బాధితుడు రవీందర్‌గౌడ్‌కు భీష్మారాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ సోమవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, రాఘవేందర్, హన్మంతు, సంతోష్, నర్సింహనాయుడు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోట మైసమ్మ విగ్రహం ప్రతిష్ఠాపన

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎదిర 4వ రెవెన్యూ వార్డులో కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగగా, సోమవారం కోట మైసమ్మ విగ్రహం ప్రతిష్ఠాపన, బొడ్రాయి శిలాభిషేకము, సాయంత్రం అమ్మవారి బోనాలు సమర్పించారు. మంగళవారం కోట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, తెల్లవారుజామున పొలిమెర్లలో పొలి చల్లనున్నారు.

రిటైర్మెంట్ వయస్సు పెంపు విరమించుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల రిటైర్మెంట్ వయస్సు పెంపు ఆలోచన విరమించుకోవాలని డీటీఎఫ్ జిల్లా రాష్ట్ర నాయకులు వామన్‌కుమార్, గోవర్ధన్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల రిటైర్మెంట్ గతంలో 58 ఉండగా, గత ప్రభుత్వం 61 ఏళ్లకు పెంచడంతో నిరుద్యోగ సమస్య అధికమైందన్నారు. ఇలాంటి సందర్భంలో పదవీ విరమణ వయస్సు మరో ఏడాది పెంచుతామనడం సరికాదన్నారు.

నేటి నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

రాజాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో భూ భారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న రంగారెడ్డిగూడ, 4న గుండ్లపొట్లపల్లి, అగ్రహారం పొట్లపల్లి, 5న కల్లెపల్లి, బీబీనగర్, 6న ఇద్గాన్‌పల్లి, 9న మల్లేపల్లి, రాయపల్లి, 10న రాజాపూర్, 11న కుచ్చర్‌కల్, 12న తిర్మలాపూర్, 13న ఖానాపూర్, 16న దొండ్లపల్లి, 17న కుత్నేపల్లి, 18న రాఘవాపూర్, 19న చెన్నవెల్లి గ్రామాల్లో నిర్వహించే సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

పాలమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులపై ఆనాడు పెట్టిన కేసులను ఎత్తి వేసి న్యాయం చేయాలని ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుతో తెలంగాణ ఉద్యమకారులు తమగోడు వెళ్లబోసుకున్నారు. ఏ నాడో ప్రభుత్వం ఉద్యమకారులపై పెట్టిన అన్ని కేసులను ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నేటికీ కేసుల పేరుతో కోర్టుకు తిప్పుతున్నారని ఆందోళన చెందారు. చంద్రానాయక్, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలు ఐక్యతగా జరుపుకోవాలి

కోయిలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతల పండుగలను గ్రామస్థులు ఐక్యతగా నిర్వహించుకోవాలని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు కృష్ణయ్య, భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బచ్చిరెడ్డి, నాగన్న, నారాయణరెడ్డి, లక్కిగౌడ్ పాల్గొన్నారు.

రాజేంద్ర ప్రసాద్ సేవలు మరువలేనివి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్రప్రసాద్ క్రీడాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని క్రీడా సంఘాల ప్రతినిధులు అన్నారు. స్వర్గీయ జిల్లా ఒలపింక్ సంఘ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ సంస్మరణ సభ ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అథ్లెటిక్స్ పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేశారు. క్రీడా సంఘాల ప్రతినిధులు రాజేందర్‌కుమార్, కురుమూర్తిగౌడ్, శరత్‌చంద్ర, బాలరాజ్ ఖాలెద్, కోచ్‌లు ఆనంద్, సునీల్, ఖలీల్, పర్వేజ్, అంజద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హన్వాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. గత నె 23న మద్దూర్ మండలం నందిపాడ్ గ్రామానికి చెందిన తిమ్మప్ప అతని మేనల్లుడు చెన్నప్ప (16) ఇద్దరు కలసి బైక్‌పై కొత్తపేట గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి తమ గ్రామానికి వెళ్తుండగా పెద్దదర్పల్లి సమీపంలో పందిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన చెన్నప్పను హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలిచంగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం తల్లి మొగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సోనియా వల్లే తెలంగాణ రాష్ట్రం

» కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ » ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్



జెండావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

పాలమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ చేశారు. టీఎన్‌జీవోస్ ఎదుట జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి జెండాను ఆవిష్కరించి, ప్రసంగించారు. టీజీ ఎస్‌పీడీసీఎల్‌లో ఎస్‌ఈ పి.వెంకటరమేష్ జెండావిష్కరణ చేశారు. డీఈ నవీన్‌కుమార్, ఏడీ చక్రవర్తి పాల్గొన్నారు.

● భూత్పూర్ : తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి పాల్గొని, మునిసిపల్ కార్యాలయంపై జాతీయ జెండాను ఎగుర వేశారు. పీఏసీఎస్ వద్ద చైర్మన్ అశోక్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ చంద్రశేఖర్, సీఐ కార్యాలయంపైన సీఐ రామకృష్ణ, ఎంపీడీవో కార్యాయలం వద్ద ఎంపీడీవో ప్రభాకర్‌చారి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కిషన్ నాయక్ జెండాను ఆవిష్కరించారు. భూత్పూర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

● దేవరకద్ర : దేవరకద్ర, కౌకుంట్ల మండల కేంద్రాలతో పాటు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీవో, మార్కెట్‌యార్డు, పోలీస్టేషన్ వద్ద ఆయా శాఖల అధికారులు జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఎగురవేసిన జాతీయ జెండా తలకిందులు కావడంతో వెంటనే సరిచేశారు.

● చిన్నచింతకుంట : మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించారు. లాల్‌కోటలో ఎంఈవో మురళికృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జెండా ఆవిష్కరించారు.

● గండీడ్ : మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ మల్లికార్జున్ రావు, ఎంపీడీవో దేవన్న పాల్గొన్నారు.

● హన్వాడ : మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కిష్టు నాయక్, ఎంపీడీవో జయప్రద, ఎంఈవో గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

● రాజాపూర్ : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రాధాకృష్ణ, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ శివానందం, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో ప్రదీప్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు.

● మూసాపేట : తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్లు రాజు, శేఖర్, ఎంపీడీవోలు కృష్ణయ్య, శ్రీనివాసులు, ఎస్‌ఐలు ఎం.వేణు, శ్రీనివాస్, ఎంఈవోలు రాజేందర్‌రెడ్డి, కురుమూర్తి, డీటీలు వినోద్‌కుమార్, ఖలీద్ పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ టౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జడ్పీ సీవో వెంకట్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఆర్టీసీ డిపో ముందు డీఎం సుజాత జెండా ఎగురవేశారు. ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ముందు ఆర్ఎం సంతోష్ కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు.

కోయిలకొండ..

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళి అర్పించారు. వివేకానంద చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

● జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మునిసిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● మిడ్జిల్ : మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయశాఖ, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, ఏవో సిద్ధార్థ, ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్ : మహమ్మదాబాద్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యయలంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో నరేందర్‌రెడ్డి, అగ్రికల్చర్ కార్యాలయంలో ఏవో నరేందర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరెట్‌లో నిర్వహించిన వేడుకల్లో పట్టణంలోని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చిన్నారులు జానపద, సాంప్రాదాయ నృత్యాలతో పాటు తెలంగాణ పాటలకు అనుగునంగా నృత్యాలు చేశారు. ప్రదర్శన అనంతరం మంత్రి జూపల్లి కృష్ణరావు చిన్నారులను అభినందించి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అదే విధంగా వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, జిల్లా అటవీశాఖ, జిల్లా మత్స్య శాఖ, సంక్షేమ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి జూపల్లి కృష్ణరావుతో పాటు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీ.మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి సందర్శించారు.

● బాలానగర్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి జెండాను ఎగురవేశారు. రాష్ట్ర సాధనకు ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళి అర్పించారు.



వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



నాట్యం చేస్తున్న చిన్నారులు

పోలీసుల పాత్ర ఎనలేనిది : డీఐజీ



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డీఐజీ ఎల్ చౌహాన్

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పోలీసు శాఖ పాత్ర ఎనలేనిదని డీఐజీ ఎల్ చౌహాన్ అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డీఐజీ కార్యాలయం జోన్-7 గద్వాల కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు కృష్ణయ్య, నాగేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ



జెండాకు వందనం చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ : విద్యార్థుల ఆత్మబలి దానాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్, ఉన్నతాధికారులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అయోమయానికి గురిచేయొద్దు

» నేషనల్ హైవే డిజైన్‌లో పాత బజారుకు రోడ్డు ఉంది » మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సి.లక్ష్మారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అసత్యపు ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని, ప్రజలను అయోమాయానికి గురిచేసి తప్పుడు ప్రచారాలు చేయొద్దని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని గౌడ పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మారెడ్డి మాట్లాడారు. పాత బజార్‌కు సిగ్నల్ గడ్డ నుంచి నేరుగా వెళ్లేందుకు రోడ్డు మార్గం లేదని ఇటీవల పత్రికలు, సోషల్ మీడియాలో కొందరు అసత్యపు ప్రచారాలు చేశారన్నారు. నేషనల్ హైవే అథారిటీస్ అధికారులు రైల్వే ఓవర్ బిడ్జి ఫ్లైఓవర్ వేసేందుకు డిజైన్ చేశారని, సదరు డిజైన్ వల్ల నేతాజీచౌక్, నాగర్‌కర్నూల్ వెళ్లే వారికి పాత బజార్‌కు వెళ్లేందుకు చాలా దూరం ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకొని రావల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇదే విషయం తెలుసుకున్న తాను అధికారులతో మాట్లాడి డిజైన్‌ను మార్చడం జరిగిందన్నారు. పాతబజార్‌కు వెళ్లేందుకు ఇబ్బంది కలుగకుండా అందుకు అనుగుణంగానే ఇందిరాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద సర్కిల్ ఏర్పాటు చేసేలా డిజైన్ మార్చినట్లు తెలిపారు. ఇటీవలే పూలే విగ్రహాన్ని రోడ్డు మధ్యలోంచి తీసి ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై తహసీల్దార్ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వలేదని, అప్పటి ఎమ్మెల్యే పట్టించుకోలేదని మరో అపవాదు తన మీద వేశారని, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అలా మాట్లాడటం, ప్రతీ విషయంలో రాజకీయం చేయడం సరికాదన్నారు. విగ్రహాల విషయంలో తాను విజ్ఞప్తి చేస్తున్నానని, పూలే విగ్రహాన్ని రహదారి పనులు పూర్తయ్యేవరకు ఎక్కడైనా భద్రంగా ఉంచాలని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, కులసంఘాల నాయకులతో ఆలోచించి నిర్ణయం తీసుకుందామన్నారు. సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మునిసిపల్ చైర్మన్ పుష్పలత, నాయకులు బాదేపల్లి రంజిత్‌బాబు, పిట్టల మురళి, రామ్మోహన్, ప్రణిల్‌చందర్, కోట్ల ప్రశాంత్‌రెడ్డి, బుక్క మహేష్, ఉమాశంకర్‌గౌడ్, నందకిషోర్‌గౌడ్, సతీష్, నాయకులు శ్రీకాంత్, రహెమాన్, కొండల్, సత్యం, నర్సిములు, మహమూద్, శ్రీనివాస్‌యాదవ్, సురేష్, ప్రకాష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి » మిన్గోనిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మిన్గోనిపల్లిలో విజయమ్మ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి, ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపైన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువ శక్తి, వంటి పథకాలను అర్హులందరికీ అందించే విధంగా చూస్తామన్నారు. మార్కెట్ చైర్మన్ కతలయ్య, ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కోయిలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బ్రెన్‌స్ట్రోక్ బాధితుడు రవీందర్‌గౌడ్‌కు భీష్మారాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ సోమవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, రాఘవేందర్, హన్మంతు, సంతోష్, నర్సింహనాయుడు, శివరాజ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్ రెడ్డి

చిన్నచింతకుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ పవన్ కుమార్‌రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి వారు పాల్గొని, మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి అధిక మెజార్టీ వచ్చే విధంగా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబి రాజు, అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరథ, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు గుబ్బా శ్రీను, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, హరినాథ్, నరసింహ, బాలస్వామి, నరేందర్, రాము పాల్గొన్నారు.

ఆర్థిక వనరుల దోపిడీకి కేంద్రం కుట్ర

పాలమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సహజ వనరులు, అటవీ సంపద, ఆర్థిక దోపిడీ చేయటానికే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేసేందుకు పంతం పట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీపీఐ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్‌తో బూటకపు ఎన్‌కౌంటర్లు జరుపుతున్నారని, కనీసం వారి మృతదేహాలను అప్పగించకుండా పైశాచికానందం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీగా పాకిస్తాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న కేంద్రం, ప్రజల కోసం సిద్ధాంత పరంగ ఉన్న మావోలతో ఎందుకు శాంతి చర్చలకు చేయటం లేదో సమాధానం చెప్పాలన్నారు. మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద అమెరికాకు మోకరిల్లడం యావత్ భారతదేశ ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉందన్నారు. జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, పరమేశ్వర్‌గౌడ్, సురేష్, రాము, అల్వాల్‌రెడ్డి, బాగికృష్ణ, చాంద్ పాషా, శంకర్‌నాయక్, శ్రీను, సత్యనారాయణ రెడ్డి, రాజు, భార్గవి, పద్మావతి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అధికారులు

జడ్చర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని 9వ వార్డు నక్కలబండ తండా, 10వ వార్డులో సోమవారం వార్డు అధికారులు, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి రాజు, హౌజింగ్ ఏఈ ఖాజా, వార్డు ఆఫీసర్ శంకర్, చైతన్య చౌహన్, వార్డు ఆఫీసర్లు జగన్, శివ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నీలవేణి, వెంకటేష్, నెహ్రూ, గోపాల్, గోవింద్, రఘు, కిషన్, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు విత్తన ఉత్పత్తి - విత్తన భద్రత చేయాలి

పాలమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం పథకం నుంచి రాష్ట్రంలోని రైతులు విత్తన ఉత్పత్తి-విత్తన భద్రత పాటించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ పథకంలో పది మంది ఉత్తమ రైతులకు వరి, కందులు, జొన్న నూతన వంగడాల విత్తనాలు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ 3 నుంచి జిల్లాలోని 17 మండలాల్లో 306 రెవెన్యూ గ్రామాల్లో 918 మంది రైతులకు విత్తన కిట్స్‌ను అందజేస్తారని తెలిపారు.

అమరుల కుటుంబాలకు సన్మానం

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : సోమవారం కలెక్టరెట్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల కుటుంబాలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా సత్కరించారు.

ట్రిబుల్ ఐటీతో కార్పొరేట్ తరహా విద్య

» నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో పాలమూరుకు ట్రిబుల్ ఐటీ ఏర్పాటు కావడం జరిగిందని, దీంతో విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్య అందుతోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పారుపల్లిలోని శ్వేత విద్యామందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. పాలమూరులో ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేసి ఈ సంవత్సరం నుంచే అడ్మిషన్‌లు ప్రారంభించడం జరిగిందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఎల్లారెడ్డిపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవోదయ పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, అభినందించారు. నాయకులు రవీందర్, విద్యాసాగర్ గౌడ్, రవినాయక్, రవియాదవ్, యాదయ్య, కృష్ణయ్య, నరేందర్‌జీ పాల్గొన్నారు.